సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



డిజిటల్ బుక్‌తో శ్రీరామరక్ష

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలకు డిజిటల్ బుక్ శ్రీరామరక్షలాగా ఉపయోగపడుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. -IIలో



ఎమ్మెల్యే అండతోనే అసాంఘిక కార్యకలాపాలు

ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి అండతోనే క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్ జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు అన్నారు. -IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/24.0

జిల్లాలో శనివారం 24.0 - 31.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నియామకం



కొలకలపూటి లక్ష్మిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కొలకలపూటి లక్ష్మిరెడ్డిని వైఎస్సార్ జిల్లా ప్రైవేట్ టీచర్ల విభాగం అధ్యక్షునిగా నియమించారు. ఈయన కడపలోని బాలవికాస్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో మ్యాథ్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గండికోటను అభివృద్ధి చేస్తాం



పర్యాటక దినోత్సవంలో అధికారులు

జమ్మలమడుగు: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటను సాస్కి నిధులతో అభివృద్ధి చేస్తామని జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం గండికోటలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్‌వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.అనంతరం సురేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రాండ్‌కెనాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందిన గండికోట ప్రత్యేకత అందిరికీ తెలిసేలా చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ శాస్త్రి శతజయంతి పురస్కారాలు

కడప సెవెన్‌రోడ్స్: ప్రముఖ సాహితీవేత్త బ్రౌన్ శాస్త్రి శతజయంతి సందర్భంగా జానమద్ది సాహితీపీఠం పురస్కారాల ప్రదానోత్సవం నవంబరు 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కడపలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి వెంకట ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, వైవీయూ ఉపకులపతి పాల్గొంటారన్నారు. సాహితీపీఠం పురస్కారాలను డాక్టర్ మేడసాని మోహన్, డాక్టర్ రేవూరు అనంత పద్మనాభరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణకు, గ్రంథాలయ సేవా పురస్కారాన్ని కర్ణాటకకు చెందిన మరె అంకేగౌడకు ఇస్తున్నట్లు తెలిపారు. పురస్కారం కింద రూ. 10 వేల నగదు, శాలువతో సత్కరిస్తామన్నారు.

పల్లె వైద్యంపై సమ్మెట

పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యుల సమస్యలు నయం కాని దీర్ఘకాలిక వ్యాధుల్లా మారాయి. సమస్యల పరిష్కారానికి గత్యంతరం లేక మరోమారు సమ్మె సైరన్ మోగించారు. దీంతో కాయ కష్టం చేసి జీవించే పల్లె వాసుల ప్రాథమిక వైద్యానికి ఆటంకం ఏర్పడింది.

- సమ్మె సైరన్ మోగించిన పీహెచ్‌సీ వైద్యులు
- సీజనల్ వ్యాధుల కాలంలో సేవలకు ఆటంకం
- ప్రజలకు తప్పని అవస్థలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కడప రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వైద్య రంగానికి మహర్దశ పట్టింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఒక కేంద్రానికి ఇద్దరు చొప్పున వైదులతో పాటు సరిపడా మిగతా వైద్య సిబ్బందిని నియమించారు. అలాగే 'ఫ్యామిలీ ఫిజీషియన్' కాన్సెప్ట్‌ను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం పల్లె వైద్యానికి కష్టకాలం వచ్చింది.

- కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే జీఓ నంబర్- 85 జారీ చేసింది. ఈ జీఓ రాకతో పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.గతంలో గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్ల పనిచేసే వైద్యులకు.. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల పనిచేసే వైద్యులకు పీజీ చేసేందుకు 30 శాతం కోటాను కేటాయించేవారు. జీఓ - 85 కారణంగా ప్రభుత్వం 30 శాతం ఉన్న కోటాను ఏకంగా 15 శాతానికి తగ్గించింది.దీంతో వైద్యులు తమ భవిష్యత్తును ప్రభుత్వం దారుణంగా దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జీఓ -85, 99గా మారింది. అలాగే మిగతా సమస్యల పరిష్కారానికి ఈ నెల 26వ తేదీ నుంచి దశల వారీగా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోషియేషన్ (ఏపీ పీహెచ్‌సీ డీఏ) ఆధ్వర్యంలో సమ్మెను ప్రారంభించారు. 2024 సెప్టెంబర్‌లో కూడా వైద్యులు సమ్మె చేశారు. ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఏడాది దాటినా హామీలు అమలుకాకపోవడంతో మరో మారు వైద్యులు ఆందోళన బాట పట్టారు.

జిల్లాలో పీహెచ్‌సీల వివరాలు

- పీహెచ్‌సీలు: 51
- ఒక ఆసుపత్రిలో ఉండే వైద్యులు: 02
- మొత్తం పనిచేస్తున్న వైద్యులు: 110
- లభించే మందుల రకాలు: 175
- వైద్య పరీక్షల రకాలు: 63
- ఒక రోజుకు వచ్చే పేషెంట్స్: 45 మందికి పైగా

పల్లె వాసులకు ఇబ్బందులు

గ్రామీణులకు ఏ అనారోగ్య సమస్య తలెత్తినా చెంతనే ఉన్న పీహెచ్‌సీకి వెళ్లి అక్కడ లభించే ఉచిత వైద్య సేవల ద్వారా ఊరట పొందేవారు. ఆసుపత్రిలో అసలు వైద్యుడే లేకపోతే స్థానికులకు అనారోగ్య ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. అసలే ఇది సీజనల్ వ్యాధుల కాలం. కీళ్ల తదితర ఒళ్లు నొప్పులతో కూడిన డెంగీ తదితర జ్వరాలు వస్తున్నాయి. దీంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులు..ఆర్ఎంపీలను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకొనే అవకాశం ఉంది. పీహెచ్‌సీల్లో వైద్యులు సమ్మెలో ఉంటే ఆ ప్రభావం క్షేత్ర స్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ తదితర వైద్య సేవలపై పెను ప్రభావం పడే అవకాశం ఉంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోవడం పట్ల ప్రజలు విస్తుపోతున్నారు.

పదోన్నతులు లేక ఇబ్బందులు...



గ్రామీణ ప్రాంతాల్లో 25 ఏళ్లుగా ప్రభుత్వ వైద్యాధికారులు పనిచేస్తున్నారు. పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ పీహెచ్‌సీల్లో అరకొర సౌకర్యాల మధ్య విధులను నిర్వహిస్తున్న వైద్యాధికారులకు పీజీ కోటా తగ్గించడం తగదు. – రాఘవేంద్ర, జిల్లా అధ్యక్షులు, ఏపీ పీహెచ్‌సీ డీఏ

జీఓ 99 రద్దు చేయాలి...



జీఓ 99ను రద్దు చేయాలి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు న్యాయం చేయాలి. ప్రభుత్వం గత ఏడాదిలో చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలి. – మొహమ్మద్ తాహా, జిల్లా కోశాధికారి, ఏపీ పీహెచ్‌సీ డీఏ

సమ్మె కార్యాచరణ ఇలా..

- 28న వాట్సప్ గ్రూప్ బహిష్కరణ
- 29న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర సేవలు మినహా అన్ని ఓపీ సేవలు బంద్
- 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు
- 3 నుంచి విజయవాడలో వైద్యాధికారుల నిరసనలు, నాయకుల నిరవధిక నిరాహార దీక్షలు

ప్రధాన డిమాండ్లు ఇవీ...

- ఇన్-సర్వీస్ కోటాను పునరుద్ధరించాలి
- టైమ్-బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలి
- గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50% ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలి.
- నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలి..
- చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ 5 వేల అలవెన్స్ మంజూరు చేయాలి
- నేటివిటీ – అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలను పరిష్కరించాలి.

తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలు....

- వైద్యులకు కచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవు మంజూరు చేయాలి.
- వైద్యుల జాబ్ చార్ట్ ఇవ్వాలి
- అనధికారిక వ్యక్తులు (ఉదాహరణకు నాన్ మెడికల్ శాఖ కు సంబంధం లేనివారు) విచ్చలవిడిగా తనిఖీలు నిర్వహించకుండా స్పష్టమైన మార్గదర్శకాలు చేయాలి.

కడప జిల్లా కళలకు కాణాచి

- డీఈఓ షేక్ షంషుద్దీన్



మన కడప- ఘన గడప పాట వీడియో ఆవిష్కరిస్తున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్: కడపజిల్లా కళలకు కాణాచి అని సంస్కృతి, సంప్రదాయాలకు, ఆత్మీయతకు పెట్టింది పేరని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని సభాభవనంలో రచయిత, ఉపాధ్యాయుడు గజ్జల వెంకటేశ్వర రెడ్డి రచించిన మన కడప-ఘన గడప పాటకు సంబంధించిన వీడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ షేక్ షంషుద్దీన్ మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలోని ఆధ్యాత్మిక స్థలాలు, దర్శనీయస్థలాలు, నదులు, ఖనిజ సంపద, కవులు,ఆటలు తదితల అంశాను కూర్చి అద్భుతమైన పాటను రచించి,గానం చేసి వీడియోగా చిత్రీకరించిన వెంకటేశ్వర రెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువులబాబు, ఏఎంఓ. వీరేంద్ర, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్ రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి, ఎస్టీయూ అధ్యక్షు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు బాలగంగి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణంరాజు, లెక్కలవారి పల్లె ప్రధానోపాధ్యాయుడు నరసింహులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్, మహేష్ బాబు, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు సజ్జల రమణారెడ్డి, ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, సైన్స్ ఉపాధ్యాయులు వేపరాల ఎబినేజర్, సైన్స్ మ్యూజియం క్యూరేటర్ రెహ్మాన్ , కౌశల్ జిల్లా కో-ఆర్డినేటర్ విజయ మోహన్ రెడ్డి, సైన్స్ కో ఆర్డినేటర్ సుబ్బానాయుడు పాల్గొన్నారు.

మాతా ప్రణామం.. సదా నీ స్మరణం



అమ్మవారిశాలలో గజలక్ష్మీదేవిగా వాసవి మాత



పొద్దుటూరు అమ్మవారిశాలలో భక్తజన సందడి

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు జిల్లాలో వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో దేవీ ఆలయాలు కళకళలాడుతున్నాయి. శనివారం అమ్మవారు వివిధరూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మాతా ప్రణామం.. కరుణించి..కాపాడు తల్లీ అని భక్తులు వేడుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



కడప: శ్రీ త్రిపురసుందరీదేవిగా కన్యకాంబ

వీరభద్రస్వామికి వెండి గద బహూకరణ

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి కర్నాటకలోని ధార్వాడ్ గ్రామానికి చెందిన ప్రవీణ్ చాడిచాల్ వెండి గదను బహూకరించారు. శనివారం ఆలయ ఈవో డీవీ రమణారెడ్డికి దీనిని అందజేశారు. గద విలువ రూ. 50నుంచి రూ. 55 వేలు ఉంటుందని, దీనికి సంబంధించిన రసీదును దాతకు అందజేసినట్లు ఈవో తెలిపారు.

అంగన్‌వాడీ.. అధోగతి

- అంగన్వాడీ కేంద్రాల పట్ల కూటమి సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం
- 2022 ఫిబ్రవరి ధరలకు అనుగుణంగానే నేటికీ బిల్లుల చెల్లింపు
- అప్పటి నుంచి మూడురెట్లు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు
- కేంద్రాల నిర్వహణ కష్టసాధ్యమంటున్న కార్యకర్తలు
- కేంద్రాల నిర్వీర్యం దిశగా చంద్రబాబు సర్కార్ అడుగులు



అంగన్వాడీ కేంద్రాల్లో భోజనం చేస్తున్న చిన్నారులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ కేంద్రాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్రాలకు వచ్చే చిన్నారులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి. అయితే ప్రస్తుత ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచుతామని ప్రభుత్వం చెబుతున్నా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటికీ పెంచకపోవడం బాధాకరం. ఈ క్రమంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, ఖర్చులు భారీగా పెరగడంతో కార్యకర్తలకు భారంగా మారింది. అసలే వారి జీతాలు అంతంత మాత్రంగా ఉంటే, దీనికితోడు పాత ధరల ఆధారంగా బిల్లులు చెల్లిస్తుండడంతో వంట ఖర్చులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- అంగన్వాడీ కేంద్రాలకు వచ్చిన ప్రీ స్కూలు పిల్లల ఆహారం కోసం కూరగాయలు, ఆకుకూరలు, పసుపు, చింతపండు, కారంపొడి తదితర సామాగ్రి ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలి. అయితే వీటి కొనుగోలుకు ఒక చిన్నారికి నెలకు రూ. 50 ప్రభుత్వం చెల్లిస్తోందని చెబుతున్నారు. అయితే ఇది ఏమాత్రం సరిపోవడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. రోజుకు ఒకరికి కూరగాయలు, పోపులకు రూ.1.50, గ్యాస్ నెలకు రూ. 450 చొప్పున ఇస్తున్నారు. అయితే ప్రస్తుతం సిలిండర్ ధర రూ. 950లకు కొనుగోలు చేస్తున్నామని, పెరిగిన ధరల కారణంగా మెను ప్రకారం వండి పెట్టాలంటే అదనపు భారం తప్పడం లేదని అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెను ఇలా..

సోమవారం	దోసకాయ పప్పు
మంగళవారం	టమోటా పప్పు
బుధవారం	ఆకుకూర పప్పు
గురువారం	కూరగాయలతో సాంబారు
శుక్రవారం	బీరకాయ లేదా సొరకాయ పప్పు
శనివారం	వెజిటబుల్ బాత్ రైస్

మెను ప్రకారం బిల్లులు

2022 ఫిబ్రవరి ధరలకు అనుగుణంగా ప్రస్తుతం బిల్లులు చెల్లిస్తున్నారు. ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు మూడు రెట్లు పెరగడంతోపాటు గ్యాస్ ధర కూడా బిల్లు చెల్లించిన దానికంటే అదనంగా రూ. 500 పెరిగింది. మెనుప్రకారం వండి పెట్టాలంటే తమకు భారంగా ఉందని, ప్రస్తుత ధరల ప్రకారం బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

- జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 13
- అంగన్వాడీ కేంద్రాల సంఖ్య: 2,389
- గర్భవతులు: 10,662
- బాలింతలు: 8,464
- ఆరేళ్లలోపు చిన్నారులు: 1,09,752

ఉన్నతాధికారులకు విన్నవించాం

కొత్త ధరల ప్రకారం బిల్లులు ఇవ్వాలని అంగన్వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. ఈ విషయంగా ఉన్నతాధికారులకు విన్నవించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాల వచ్చిన వెంటనే కొత్త బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడతాం. – రమాదేవి, ఐసీడీఎస్ పీడీ, కడప

క్లుప్తంగా

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

లింగాల : మండలంలోని దొండవాగుకు సమీపంలో టీడీపీ నాయకుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి గోదాం వద్ద కోడిపందెం నిర్వహిస్తుండగా ఇన్‌ఛార్జి ఎస్‌ఐ రవికుమార్, పోలీసులు దాడులు నిర్వహించారు. కాశిరెడ్డినాయన మండలం అక్కులనారాయణపల్లెకు చెందిన దానాశివయ్య, ఉలిమెల్ల గ్రామానికి చెందిన గిద్దలూరు శివకృష్ణ, నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన సంపతి లింగమయ్యలను అరెస్టు చేశారు. చాలా రోజులుగా టీడీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో విచ్చలవిడిగా జూదాలు, కోడి పందెలు సాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

కుక్కల దాడి: మేక పిల్లలు మృతి

బ్రహ్మంగారిమఠం : కుక్కలు దాడి చేసిన ఘటనలో 32 మేక పిల్లలు శనివారం మృతిచెందాయి. మండలంలోని జోకుపల్లె గ్రామానికి చెందిన జాల జ్యోతి, భర్త ప్రసాద్ జీవనోపాధికొరకు బి.కోడూరు మండలం అంకనగొడుగునూరు గ్రామానికి చెందిన యేసు రత్నం వద్ద మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నారు. మేకలను శుక్రవారం యథాప్రకారం కట్టివేసి ఉంచారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కుక్కలు దాడి చేయడంతో 32 మేక పిల్లలు మృతి చెంగాయి. లక్ష రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్) సమీపంలో ఓ వ్యక్తి విషపు మాత్రలు మింగి ఆత్మహత్య పాల్పడినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన మురహరి కుమార్ (35) కూలి పనులకు వెళుతూ జీవనం సాగించేవాడు. అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 23న రిమ్స్ సమీపంలో గుర్తుతెలియని మాత్రలు మించి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. అతడి భార్య మహిషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేస్తున్నారు.

మహిళ మృతి.. కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని మల్లెల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి గత పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నెల 26న సాయంత్రం ముద్దనూరు మండలం తిమ్మాపురంలో తెలిసిన వారింటికి బయలుదేరింది. శుక్రవారం రాత్రి 8.5 0గంటల ప్రాంతంలో తిమ్మాపురం రైతు సేవా కేంద్రం వద్ద ఆమె స్పృహ తప్పిపడిపోయిన ఆమెను 108లో ప్రొద్దుటూరుకు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



నేడు రేబిస్ వ్యాధి నివారణ దినం

తక్షణ చికిత్సతోనే ప్రాణాలకు రక్షణ

కుక్క కరిచిన ప్రదేశాన్ని సబ్బు నీళ్లతో శుభ్రం చేసుకుని సరిపెట్టుకునే వాళ్లుంటారు. కానీ పెంపుడు కుక్క, వీధి కుక్క... ఏది కరిచినా రేబీస్ రాకుండా ఇంజెక్షన్లు తీసుకోవడం తప్పనిసరి. కుక్క కరిచిన వెంటనే వైద్యుడిని సంప్రదించి టీకా వేయించుకుంటే రేబిస్ బారినుంచి తప్పించుకోవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. 28న రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కడప అగ్రికల్చర్: కడప ప్రభుత్వ ఆస్పత్రికి కుక్క కాటు కేసులో ఏటా పెరుగుతున్నాయి. 2022 నుంచి 2025 ఆగస్టు వరకు 10,104 మంది కుక్క కాటుకు గురై చికిత్స తీసుకున్నారు. ఏటా సెప్టెంబర్ 28న రేబిస్ వ్యాధి నివారణ దినం నిర్వహిస్తూ.. ప్రభుత్వం కుక్క కాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే వీధి కుక్కల బెడద ఇటీవల పెరగడంతో పలువురు కుక్క కాటుకు గురవుతున్నారు. ప్రాథమిక ఆస్పత్రుల్లో సకాలంలో మందులు లేకపోవడంతో వేల రూపాయలు బయట ఆస్పత్రులకు ఖర్చు చేస్తున్నారు. వీధి కుక్కలను తరలించడంలో మున్సిపాల్టీ అధికారులు నిర్లక్ష్యం చేస్తుండడంతో ఏటా కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి.

వ్యాధి ఎలా వస్తుంది

గబ్బిలాలు, పిల్లులు, నక్కలు, కోతి లాలాజలంలో రేబిస్ ఉంటుంది. అవి కరచినా, వాటి లాలాజలం శరీరభాగాల్లోని ద్రవాల్లోనూ, గాయాల పైనా పడినా ప్రాణాంతకరమైన రేబిస్ వ్యాధికి దారి తీస్తుంది. రేబిస్ వైరస్ సోకిన కుక్క కరిస్తే తొలుత కండరాలకు, అనంతరం శ్వాసకోశ నాళాలకు వైరస్ సోకుతుంది.. చలాకీగా కదిలే కుక్క అకస్మాత్తుగా నీరసించడం, ఒంటరిగా ఉండిపోవడం, నోటి నుంచి సొంగ కారడం, నీటికి దూరంగా ఉండడం, గుండ్రంగా తిరుగుతూ ఉండడం వంటి లక్షణాలు కనిపించిన కుక్కకు దూరంగా ఉండాలి. వాటికి ఆహారం తినిపించడం, ఆడుకోవడం చేయరాదు.

కరిస్తే కనిపించే లక్షణాలు

కుక్క కరచిన మనిషికి ఆకలి తగ్గడం, తల తిరగడం, జ్వరం రావడం, నీరు చూసినా భయపడడం వంటి లక్షణాలుంటాయని తెలిపారు. కుక్కలకు సోకే రేబీస్ వైరస్ శరీరంలో దీర్ఘకాలం పాటు ఉండిపోతుంది. కుక్క ప్రాణాలు కోల్పోయేలోపు ఎంతమందిని కరిస్తే అంతమందికీ రేబీస్ వైరస్ సోకుతుంది. కుక్క గోళ్లు గీసుకున్నప్పుడు వెంటనే సబ్బు నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. కొరికినప్పుడు పన్ను లోపలకు దిగి రక్తం కారితే ఆ ప్రదేశంలో ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్ తీసుకోవాలి, రేబీస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. వ్యాధి బాగా ముదిరితే మనిషి కుక్కలా ప్రవర్తిస్తారు. కోమాలోకి వెళ్లి శ్వాస ఆగిపోయే ప్రమాదం లేకపోలేదు.

ఏది కరిచినా..

కుక్క కరిచినప్పుడు, ఎంత లోతుగా కరిచింది అనే దాని మీదే చికిత్స ఆధారపడి ఉంటుంది. కుక్క గోళ్లతో గోకడాన్ని గ్రేడ్ ఎగా, కొరికినప్పుడు పంటిగాటు ఏర్పడితే ఆ గాయాన్ని గ్రేడ్ బిగా, పంటిగాటుతోపాటు రక్తస్రావమైతే గ్రేడ్ సిగా పరిగణించాలి. ఈ గాయాలకు రేబిక్యూర్ వ్యాక్సిన్‌తో పాటు, రేబీస్ ఇమ్యునోగ్లోబ్యులిన్ టీకా ఇవ్వాల్సి ఉంటుంది. కుక్కకు ఎలాంటి టీకాలు ఇప్పించకపోయినా, అది వీధికుక్క అయినా, పెంపుడు కుక్క అయినా రేబీస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. సాధారణంగా చాలామంది వీధిలో రోజూ కనిపించే కుక్క, దానికేం కాలేదు కాబట్టి మాక్కూడా ఏం జరగదు అని చికిత్సను నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ అది ఎలాంటి కుక్క అయినా, ఎలాంటి లక్షణాలు లేకున్నా కరచిన వెంటనే తప్పనిసరిగా వైద్యులను కలిసి ఇంజెక్షన్లు తీసుకోవాలి. పెంపుడు కుక్కల నుంచి కుటుంబ సభ్యులకు వ్యాధులు సోకుతాయి కాబట్టి వాటికి తప్పనిసరిగా యాంటీ రేబీస్‌తో పాటు లెప్టోస్పైరోసిస్ లాంటి ఇతరత్రా వ్యాధుల టీకాలు వేయించాలి.

దోసులు ఇలా..

పెంపుడు కుక్క : యాంటీ రేబీస్ టీకాలు ఇప్పించిన పెంపుడు కుక్క కరిచినప్పుడు మూడు డోసుల యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు తీసుకోవాలి. కుక్క కరిచిన రోజు, ఏడవ రోజు 21 రోజు ఈ ఇంజెక్షన్లు తీసుకోవాలి.

వీధి కుక్క : ఈ కుక్క కరిచినప్పుడు ఐదు డోసుల యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు తీసుకోవాలి. కుక్క కరిచిన రోజు, మూడో రోజు, ఏడవ రోజు, 14వ రోజు, 27వ రోజు ఈ ఇంజెక్షన్లు తీసుకోవాలి. 90వ రోజున బూస్టర్ డోసు తీసుకోవాలి.

కుక్క కాటు ప్రమాదం



కుక్క కరిచిన వెంటనే ఆ భాగంలో కుళాయి నీటితో పది నిమిషాల పాటు శుభ్రంగా కడగాలి. ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించి టీకాలు వేయించుకోవాలి. వైద్యులు లేకుంటే మెడికల్ స్టోర్స్‌లో లభించే అయోడిన్, సేవ్‌లాన్ వంటి యాంటిసెప్టిక్ లోషన్లు రాయాలి. గాయం అయితే వైద్యుడిని సంప్రదించి రేబిస్ ఇమ్యూనోగ్లోబులిన్ టీకా వేయించుకోవాలి. బయట ఇంజెక్షన్ కొనాలంటే రూ.3వేలు అవుతుందని, ప్రభుత్వఆస్పత్రిలో ఉచితంగా వేస్తారు.

– డాక్టర్ రాంబాబు, పశు వైద్యాధికారి, వెటర్నరీ పాలిక్లీనిక్, కడప

ఎమ్మెల్యే అండతోనే అసాంఘిక కార్యకలాపాలు

- పోలీసులను బ్లాక్‌మెయిల్ చేయడం ఎమ్మెల్యేకు అలవాటు
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, ఆయన కుమారుడు నంద్యాల కొండారెడ్డి అండతోనే ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్, ఇతర జూదాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. దొరసానిపల్లెలోని తన నివాసంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ పవిత్రమైన దేవాలయం లాంటి అసెంబ్లీలో ఇటీవల ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అసత్యాలు మాట్లాడారన్నారు. లంచాలు తీసుకొని అసాంఘిక శక్తులకు కొందరు సహకరిస్తున్నారని మాట్లాడడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నంత కాలం తన అండతో అసాంఘిక కార్యకలాపాలు జరిగాయని ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదమన్నారు. క్రికెట్ బెట్టింగ్, మట్కా, పేకాట జరగడానికి పోలీసులు కారణం కాదని అన్నారు. ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే జూదమాడేవారిని గత ఎన్నికలకు ముందు టీడీపీలోకి ఆహ్వానించే వారు కాదని, ఎన్నికలప్పుడు వారితో పెద్ద ఎత్తున చందాలు తీసుకొని, ఇపుడు వారికి ఆదాయ వనరులు సమకూర్చేందుకు ఎర్రతివాచీ పరచారన్నారు. ఎమ్మెల్యే అండతో మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం నిర్వహించేదెవరో, వాళ్లందరికీ ఎవరు వడ్డీకి డబ్బులిస్తున్నారో, రేషన్ బియ్యం నల్లబజారులకు తరలిస్తున్నదెవరో, భూ ఆక్రమణదారులెవరో తనకు తెలుసునని రాచమల్లు అన్నారు. ఎమ్మెల్యేకు ప్రొద్దుటూరు డీఎస్పీ సరిపోదనే కోపంతో ఆమెను అవినీతి పరురాలిగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తాను చెప్పినట్లు వినే డీఎస్పీని తెచ్చుకొని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధించాలనే కారణంతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని చెప్పారు. బ్లాక్ మెయిల్ అనేది వరదరాజులరెడ్డికి కొత్తేంకాదని 25 ఏళ్లుగా ఆయన ఇదే పని చేస్తున్నారని తెలిపారు. ఒక్కో బ్యాచ్‌కు 40–50 మందిని గోవా క్యాషినోకు తీసుకెళ్లి జూదాలు ఆడించే కౌన్సిలర్లు ఎవరో పోలీసులకు తెలుసునని రాచమల్లు అన్నారు.



మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

కుమారుడిని అదుపులో పెడితే చాలు

తన కుమారుడు నంద్యాల కొండారెడ్డిని ఎమ్మెల్యే వరద అదుపులో పెట్టుకుంటే ప్రొద్దుటూరులో జూదం ఉండదని రాచమల్లు అన్నారు. పోలీసులు జూదరులను పట్టుకుంటే సీఐలు, ఎస్‌ఐలకు ఫోన్ చేసి కొండారెడ్డి వదలిపెట్టమని హుకుం జారీ చేస్తున్నాడని, వదలకుంటే అధికారుల పట్ల దుబారాగా మాట్లాడుతున్నాడని అన్నారు. ముందు టీడీపీలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. పోలీసులకు ఎమ్మెల్యే ఆదేశాలిస్తే వారం రోజుల్లో మొత్తం కంట్రోల్ చేస్తారన్నారు. సమావేశంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, పార్టీ ప్రొద్దుటూరు, మార్తల ఓబుళరెడ్డి, బాణా కొండారెడ్డి, గజ్జలకళావతి, పిట్టాభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల కుట్రలతోనే మేయర్‌పై అనర్హత

- దేశంలో ఎక్కడా ఇలాంటి సంఘటన జరగలేదు
- మేయర్ అవినీతికి పాల్పడినట్లు విజిలెన్స్ విచారణలో లేదు
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఆగ్రహం

కడప కార్పొరేషన్ : టీడీపీ నేతల కుట్రలతోనే మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు పడింతే తప్పా హైకోర్టు తొలగించలేదని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మల్లికార్జున, కె.బాబు, ఎస్‌ఏ షంషీర్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ టీడీపీ నగర ప్రధాన కార్యదర్శిగా కొత్తగా నియమితులైన సుబ్బారెడ్డి మాట్లాడిన మాటలన్నీ శుద్ధ అబద్ధాలన్నారు. మేయర్‌గా సురేష్‌బాబు అవినీతికి పాల్పడినట్లు విజిలెన్స్ విచారణలో ఎక్కడా లేదని, ఎమ్మెల్యే మాధవి ప్రభుత్వానికి రాసిన తన లేఖలోనూ ఆ విషయం చెప్పలేదన్నారు. మేయర్ కుటుంబ సభ్యులు కాంట్రాక్ట్ పనులు చేయకూడదన్న ఒకే ఒక్క కారణం చూపి ఆయనపై అనర్హత వేటు వేశారన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి సంఘటన జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన ఎనిమిది మంది కార్పొరేటర్లలో నలుగురు వైఎస్సార్‌సీపీలో కీలకంగా వ్యవహరించారని, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వారికి అగ్రపీఠం వేశారని గుర్తుచేశారు. టీడీపీలో రెండు, మూడు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ బజారున పడుతున్నారేగానీ, ఇందులో వైఎస్సార్‌సీపీ పాత్ర ఏమీ లేదన్నారు. మాజీ మేయర్ సురేష్ బాబును విమర్శించే స్థాయి, అర్హత సుబ్బారెడ్డికి లేదన్నారు. ఎమ్మెల్యే మాధవిని టీడీపీలోని ఓ మహిళ ఏడాదిన్నర క్రితం దూషించి వీడియో పెట్టారని, ఆమెను నిన్న, మొన్న అరెస్ట్ చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడిగా ఉన్న శివకొండారెడ్డి అప్పట్లోనే ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఎమ్మెల్యే మనుషులు నడిరోడ్డుపై శివకొండారెడ్డిపై దాడిచేసి రిటర్న్ గిఫ్ట్ కూడా ఇచ్చారని గుర్తు చేశారు. మేయర్ సురేష్‌బాబు వేసింది చెత్త కాదని, హాస్పిటల్ వేస్ట్ అయిన నీడిల్స్, చీము, నెత్తురుతో ఉన్న దూది, కత్తిరించిన వేళ్లు వేశారన్నారు. కుర్చీ వేయకుండా మహిళా ఎమ్మెల్యేను అవమానించారని మొత్తుకుంటున్న వీళ్లకు..సురేష్ బాబు సతీమణి మహిళ అన్న సంగతి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. డీఎంఎఫ్ నిధులు, కుడా నిధులు ఈ ప్రాంత ప్రజలు కట్టిన పన్నుల నుంచే వచ్చే వాటా తప్పా ప్రభుత్వం ఇచ్చేవి కావన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు మాట్లాడుతూ సుబ్బారెడ్డి కార్పొరేటర్ పదవికి రాజీనామా చేసి టీడీపీ నగర ప్రధాన కార్యదర్శిగా మాట్లాడాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ భిక్షతో పదవులు వచ్చాయన్న విషయం మరిచిపోవద్దన్నారు. సుబ్బారెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులంతా సమష్టిగా కృషి చేసి ఏకగ్రీవం చేయించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం 16 నెలల్లో కడపకు రూపాయి మంజూరు చేయలేదని, కుడా నుంచి వచ్చే నిధులు, లేఔట్ల నుంచి వచ్చిన ఆదాయంతోనే పాలన సాగిందన్నారు. కె.బాబు, శివకోటిరెడ్డి, షంషీర్, రామలక్ష్మణ్‌రెడ్డి, చంద్రహాసరెడ్డి, షఫీ, అజ్మతుల్లా, గౌస్, అక్బర్, త్యాగరాజు, కిరణ్, నాగమల్లారెడ్డి, సుబ్బరాయుడు, శంకరాపురం సింధు, శ్రీరంజన్‌రెడిడ, డిష్ జిలాన్, రెడ్డి ప్రసాద్, బండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

వైఎస్సార్‌సీపీ నాయకులకు డిజిటల్ బుక్ శ్రీరామరక్ష

- ప్రభుత్వం ఏర్పడగానే అందరికీ న్యాయం చేస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలకు డిజిటల్ బుక్ శ్రీరామ రక్షలా ఉపయోగపడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. కడప వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్లమెంటు పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధ, మాజీ మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగంలతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. కోర్టులు పదే పదే హెచ్చరిస్తున్నా పోలీసులు లెక్క చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలను తెలుపుతూ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని వీడియోలు, ఫోటోలు అప్‌లోడ్ చేయొచ్చన్నారు. యాప్‌లో నమోదు చేయలేనివారు 040–49171718 నంబర్‌కు కాల్‌చేసి నమోదు చేయించుకోవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడగానే వారికి న్యాయం చేస్తామన్నారు. దుర్మార్గాలకు పాల్పడిన వారిని తప్పకుండా చట్టం ముందు నిలబెడతామని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎస్.యానాదయ్య, పులిసునీల్‌కుమార్, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, పి.రామ్మోహన్‌రెడ్డి, షఫీ, దాసరిశివ, సింధేరవి, షేక్ షఫీ, ఫయాజ్ పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

కడపలో ఇంజినీరింగ్ విద్యార్థిని కిడ్నాప్..!

- సినీ ఫక్కీలో వెంబడించి పట్టుకున్న చింతకొమ్మదిన్నె పోలీసులు
- నలుగురిపై కిడ్నాప్ కేసు నమోదు

చింతకొమ్మదిన్నె/కడప అర్బన్ : కడప పులివెందుల రోడ్డులోని ఓ కళాశాల సమీపంలో ఇంజినీరింగ్ విద్యార్థిని కారులో బలవంతంగా ఎక్కించుకుని పారిపోయిన సంఘటన శనివారం జరిగింది. సీఐ బాలమద్దిలేటి వివరాల మేరకు.. తాను, తన కుమార్తె ఉండగా.. తనను పక్కకు తోసి కుమార్తెను ఎత్తుకెళ్లినట్లు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చింతకొమ్మదిన్నె పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఐ బాలమద్దిలేటి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. కిడ్నాపర్ ముద్దనూరు మండలం బొందరకుంట గ్రామానికి చెందిన పవన్‌కళ్యాణ్ అని గుర్తించారు. అతడి కారు నెంబర్ తెలుసుకుని సీఐ బాలమద్దిలేటి ఇటు వేంపల్లె, కమలాపురం, ఎర్రగుంట్ల పోలీసులను అలర్ట్ చేశారు. దీంతో ఎర్రగుంట్లలో కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఇంజినీరింగ్ కళాశాల వద్ద...

తొండూరు మండలం సైదాపురం గ్రామానికి చెందిన యువతి పులివెందుల రోడ్డులోని ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులు కావడంతో ఆ యువతి తల్లి తన కుమార్తెను తీసుకెళ్లేందుకు కాలేజీ వద్దకు వచ్చింది. ఆమె కుమార్తెతో ఊరికి వెళ్లేందుకు బస్టాపు వద్ద ఉండగా పవన్‌కళ్యాణ్, అతని సోదరుడు రాజేశ్, అరవింద్, సురేంద్రలతో కలిసి కారులో అక్కడకి వచ్చారు. యువతిని బలవంతంగా కారులో ఎక్కించే ప్రయత్నం చేయగా తల్లి అడ్డుపడింది. వారు ఆమెను కిందకు తోసివేసి కారులో ఎక్కించుకుని పరారైనట్లు తెలిపారు. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దనూరు మండలం బొందలకుంటకు చెందిన పవన్ కల్యాణ్, అతని తమ్ముడు రాజేశ్, స్నేహితులు అరవింద్, సురేంద్రలపై కిడ్నాప్ కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారిస్తామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అన్నను తిడుతున్నా పవన్ నోరువిప్పలేదెందుకు?

– మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



కడప కార్పొరేషన్ : అన్న మెగాస్టార్ చిరంజీవిని అసెంబ్లీ సాక్షిగా బాలక్రిష్ణ వాడు, వీడు అంటుంటే డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎందుకు నోరు విప్పలేదని మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా ప్రశ్నించారు. కడప వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ గౌరవ శాసన సభలో బాలకృష్ణ తలపై కళ్లద్దాలు, జేబులో చేతులు పెట్టుకొని తూగుతూ మాట్లాడటాన్ని ఎవరూ హర్షించడం లేదన్నారు. డాక్టర్లు ధ్రువీకరించిన మానసిక రోగి బాలకృష్ణ అన్నారు. సినీ పెద్దలను జగన్‌మోహన్‌రెడ్డి అవమానించారని ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్ దుష్ప్రచారం చేశారన్నారు. నేడు చిరంజీవి స్పందించి ఆనాడు జరిగిన వాస్తవాలను బయటపెట్టారన్నారు. వైఎస్.జగన్ తమను ఎంత సాదరంగా ఆహ్వానించి, మర్యాద చేశారో అందులో చెప్పుకొచ్చారన్నారు. ఇప్పటికైనా చిరంజీవి స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తన అన్నను అసెంబ్లీలో తూలనాడుతుంటే డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌గానీ, జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలుగానీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

బాలక్రిష్ణకు మెంటల్

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



హిందూపురం ఎమ్మెల్యే బాలక్రిష్ణకు మెంటల్ ఉందని డాక్టర్లు సర్టిఫై చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బాలక్రిష్ణ ఇంట్లో కాల్పులు జరిగినప్పుడు తనకు ఫోన్ చేశారని, వైఎస్సార్‌ను కలిసేందుకు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరిని పంపాలని చెప్పానన్నారు. వైఎస్సార్ కుటుంబానికి బాలక్రిష్ణ ఎల్లప్పుడూ రుణపడి ఉండాలన్నారు. తాను హైదరాబాద్ వెళ్లేసరికి వారిద్దరూ రాలేదని, తానే వెళ్లి ఉద్దేశ్యపూర్వకంగా కాల్చలేదని వైఎస్సార్‌ను బ్రతిమాలానన్నారు. ఆయన స్పందించి అరెస్ట్ చేయకుండా చర్యలు తీసుకున్నారన్నారు. ఆనాడు వారి బంధువులెవరూ ఆయన వెంట రాలేదని, చంద్రబాబైతే నాలుగు రోజుల తర్వాత వచ్చారన్నారు. బాలక్రిష్ణ స్థలం రోడ్డు విస్తరణలో పోతుంటే రోడ్డును డైవర్ట్ చేసి స్థలాన్ని కాపాడారన్నారు. బసవతారకం కేన్సర్ ఆసుపత్రికి టీడీపీ హయాం నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉంటే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసి పెద్ద మనసు చాటారన్నారు. చేసిన మేలు మర్చిపోయి అసెంబ్లీలో తాగి మాట్లాడటం దారుణమని మండిపడ్డారు.

సంస్కార హీనంగా వ్యవహరించారు

– బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ



ఎమ్మెల్యే బాలక్రిష్ణ అసెంబ్లీలో సంస్కార హీనంగా వ్యవహరించారని బద్వేల్ ఎమ్మెల్యే డా. దాసరి సుధ అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన దేవాలయం లాంటి శాసన సభలో అవసరం లేకపోయినా సభలో లేని వైఎస్.జగన్, చిరంజీవిలను వాడు, వీడు అంటూ అనుచితంగా మాట్లాడటం మంచిది కాదన్నారు. ఆయన వ్యాఖ్యలను స్పీకర్‌తోపాటు సభలో ఎవ్వరూ ఖండించలేదని, పైగా అందరూ నవ్వుతూ ప్రోత్సహించడం దారుణమన్నారు.